క్లుప్తంగా

అమ్మవారికి ప్రత్యేక పూజలు



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మ అమ్మవారిని శుక్రవారం పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. వేసవి సెలవులతోపాటు పలు శుభకార్యాలు ఉండటంతో అమ్మవారి దర్శనానికి వివిధ జిల్లాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయ క్యూలైన్లు, పరిసరాలు కిక్కిరిశాయి. వేకువజామునుంచే భక్తులు పాలు,పొంగళ్లతో అమ్మవారికి బోనాలు సమర్పించారు. ప్రత్యేక పూజలు చేసి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారికి భక్తుల సౌజన్యంతో ప్రత్యేకంగా మల్లెలతో అలంకరించారు.

కొనసాగుతున్న సర్వే



పెనుగంచిప్రోలు: మండలంలో ప్రత్యేక అవసరాలు కలిగిన (దివ్యాంగ) పిల్లల నమోదు కోసం మే ఒకటోతేదీ నుంచి చేపట్టిన ప్రత్యేక సర్వే కొనసాగుతోంది. ఎంఈఓ డి.రవీంద్ర ఆధ్వర్యంలో ఈసర్వే ఈనెల తొమ్మిదో తేదీ వరకు కొనసాగుతుందని ఎంఈఆర్టీ ఉపాధ్యాయులు శివపార్వతి, జాన్‌లీలా తెలిపారు. వారు మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకు 25 మంది దివ్యాంగులను గుర్తించి భవిత కేంద్రం పాఠశాలలో చేర్పించినట్లు తెలిపారు. వినికిడి లోపం, మాటలు రాకపోవడం, అంధత్వం, బుద్ధిమాంద్యం, ఆటిజం వంటి 21రకాల వైకల్యాలుగల పిల్లలను గుర్తించి వారిని భవిత కేంద్రంలో చేర్పిస్తున్నటుల్ల వివరించారు. భవిత సెంటర్ల ద్వారా అందజేస్తున్న స్పీచ్‌థెరఫీ, ఫిజియోథెరఫీ, వ్యక్తిత్వ వికాసం వంటి శిక్షణలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. పాఠశాలకు రాలేని తీవ్ర వైకల్యం కలిగిన పిల్లలకు ప్రతి శనివారం ఇంటివద్ద శిక్షణ అందిస్తున్నామన్నారు. సమగ్ర శిక్ష ద్వారా నడపబడుతున్న ఈభవిత కేంద్రాల్లో విద్యను అభ్యసించే పిల్లలకు పలు అలవెన్సులు, సంక్షేమ పథకాలను ప్రభుత్వం అందజేస్తోంది. కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఏఎన్‌ఎం, ఆశ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ ఆఫీసుపై టీడీపీ జెండాలు




మాచినేనిపాలెం(వత్సవాయి) :సార్వత్రిక ఎన్నికలు ముగిసిన తరువాత టీడీపీ అధికారంలోనికి రావడంతో ఆపార్టీకి చెందిన పలువురు కార్యకర్తలు గ్రామాల్లో రెచ్చిపోతున్నారు. తాజాగా శుక్రవారం మాచినేనిపాలెంలో గ్రామంలోని పంచాయతీ కార్యాలయాలనికి టీడీపీ జెండాలు కట్టారు. ఇలా పంచాయతీ కార్యాలయాలపై ఎటువంటి పార్టీ జెండాలు కట్టవద్దనే వారించే ప్రభుత్వ సిబ్బందే లేకుండా పోయారు. ఎవరన్నా ఇది మంచిపద్ధతి కాదు, ఈ భవనం ప్రజలందరికీ ఉపయోగడేది అని చెబితే వారిపై కూడా దాడులకు దిగుతున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అభివృద్ధిపై దృష్టి సారించాలి : బీఎస్పీ

నందిగామ: రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటవుతున్న కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి పెట్టాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బచ్చలకూర పుష్పరాజ్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. కూటమి పార్టీలు ఎన్నికల సమయంలో ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలకు ఏమైనా అన్యాయం జరిగితే ప్రజల తరపున ఏన్డీఏ కూటమి ప్రభుత్వాన్ని నిలదీయడానికి బీఎస్పీ ఎప్పుడు సిద్ధంగా ఉంటుందని ఆయన తెలిపారు.

రంజింప చేసిన హరికథ



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలోని ధర్మపథం వేదికపై శుక్రవారం సాయంత్రం బీబీ నారాయణ భాగవతార్ బృందం ఆలపించిన హరికథ భక్తులను రంజింప చేసింది. అమ్మవారి పంచహారతుల సేవ అనంతరం నారాయణ భాగవతార్ హరికథను ఆలపించగా, ఆయనకు హార్మన్, మృదంగంపై పొడుగు ప్రభాకర్ చక్కటి సహకారం అందించారు.

విద్యార్థులకు బహుమతులు అందజేత

కంచికచర్ల : స్థానిక గ్రంథాలయంలో విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరం శుక్రవారంతో ముగిసింది. విద్యార్థులకు ఆయా అంశాల్లో పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. శిబిరం ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంఈవో బి.బాలాజీ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకను వెలికితీసేందుకు ఈ వేసవి శిక్షణ శిబిరం ఎంతగానో దోహదపడిందని పేర్కొన్నారు. విద్యార్థులు సైతం ఎంతో ఉత్సాహంగా పాల్గొని చిత్ర లేఖనం, యోగా, చదరంగం, డ్యాన్స్ తదితర అంశాలపై శిక్షణ పొందారన్నారు. గ్రంథాలయాల ప్రాముఖ్యంపై విద్యార్థులకు అవగాహన పెంపొందించడంతోపాటు పుస్తకపఠనం ప్రాధాన్యాన్ని విద్యార్థులకు వివరించడం అభినందనీయమన్నారు. విద్యార్థుల మెదడుకు పదునుపెట్టేందుకు ఈ శిక్షణ శిబిరం ఎంతో ఉపయోగపడిందని తెలిపారు. కార్యక్రమంలో కంచికచర్ల గ్రంథపాలకుడు అల్లూరు రామచంద్రుడు, విశ్రాంత గ్రంథపాలకుడు రంగిశెట్టి వెంకటేశ్వర్లు, తెలుగు ఉపాధ్యాయుడు షేక్ ఇస్మాయేల్, కవి, రచయిత నీలం సర్వేశ్వరరావు, యోగా గురువు ఎం.మల్లికార్జునరావు, ఐఈఆర్టీ ఉపాధ్యాయుడు ఎం.కనకారావు, డాన్స్‌మాస్టర్ బిత్రా రాహుల్‌కుమార్, మేడూరు మాణిక్యాలరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు..ఆధునిక దేవాలయాలు

జగ్గయ్యపేట అర్బన్: నేటి ఆధునిక దేవాలయాలుగా పిలువబడుతున్న గ్రంథాలయాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని జగ్గయ్యపేట ఎంపీడీవో మేకా రమేష్‌బాబు సూచించారు. స్థానిక జిల్లా గ్రేడ్–1 స్థాయి గ్రంథాలయంలో విద్యార్థుల కోసం 23రోజులుగా నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం శుక్రవారం ముగిసింది. ఈసందర్భంగా ఎంపీడీవో రమేష్‌బాబు మాట్లాడుతూ విద్యార్థులు వేసవి సెలవుల్లో తమ విలువైన సమయాన్ని వృధా చేసుకోకుండా విజ్ఞాన శిబిరంలో పాల్గొని అనేక కొత్త విషయాలను తెలుసుకున్నారన్నారు. శిక్షణ శిబిరంలో పాల్గొన్న విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు కష్టపడి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. సమ్మర్ క్యాంపులో ఉచితంగా శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులు కవి, దోసపాటి నాగేశ్వరరావు, టి.వినోద్‌బాబు, టి.ప్రసాద్‌బాబు, మణిరత్నం, అల్లి చంద్రశేఖర్, నాగమల్లికలను ఎంపీడీవో అభినందించారు. గ్రంథాలయాధికారి ఆలేటి ప్రభ మాట్లాడుతూ వేసవి శిక్షణ శిబిరంలో తమ సమయాన్ని వెచ్చించి శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులకు, సహకరించిన పెద్దలకు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం ఆయా అంశాల్లో నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. శిక్షణ శిబిరంలో పాల్గొన్న విద్యార్థులందరికీ సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ బీడీసీలు రమేష్, నాగమల్లిక, సిబ్బంది రమేష్, శ్యామల, సత్యవతి, రాము, బీడీసీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కంచికచర్ల ఎంఈవో బాలాజీ



మాట్లాడుతున్న పేట ఎండీవో రమేష్‌బాబు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న బాలాజీ, గ్రంథపాలకుడు రామచంద్రుడు



విజేతలతో జగ్గయ్యపేట గ్రంథాలయాధికారి ఆలేటి ప్రభ, రమేష్‌బాబు తదితరులు

గ్రామాల్లో టీడీపీ కార్యకర్తల దౌర్జన్యం

కంచికచర్ల : సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో విజయం సాధించడంతో ఆపార్టీ శ్రేణులు గ్రామాల్లో దాడులకు పాల్పడుతున్నాయి. మండలంలోని పెండ్యాలలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు గ్రామసచివాలయం తలుపులు పగులకొట్టారు. ఆ భవనంపై టీడీపీ, జనసేన జెండాలు కట్టి ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేశారు. అదేవిధంగా వేములపల్లి గ్రామంలో నిర్మాణదశలో ఉన్న ప్రాథమిక సహకార పరపతి సంఘం భవనంపై టీడీపీ జెండాలు కట్టారు. మండలంలోని మోగులూరులో టీడీపీ కార్యకర్తలు, గ్రామ సచివాలయంలో కుర్చీలు పగులకొట్టి భవనం పై భాగాన టీడీపీ జెండాలు కట్టారు. దీంతో గ్రామాల్లోని ప్రజలు భయాందోళలకు గురవుతున్నారు. అంతేకాకుండా వేములపల్లిలో రాజరాజేశ్వరి దేవస్థానానికి చెందిన భూములను దేవాలయ ధర్మకర్తలు వేలం పాట నిర్వహించగా, గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కౌలురైతులు వేలంలో ఆభూములను దక్కించుకుని వేసవి దుక్కులు దున్నారు. అయితే టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆ భూములు తమపార్టీ వారికే దక్కాలని తిరిగి ఆ భూములను దున్నుతున్నారు. దీంతో గ్రామంలో ఘర్షణ వాతావరణం నెలకొంది. గ్రామాల్లో టీడీపీ కార్యకర్తలు కవ్వింపు చర్యలకు పాల్పడుతుండటంతో గ్రామాల్లో కొన్నిచోట్ల ఘర్షణలు చోటుచేసుకుంటున్నాయి. ఆయా ఘటనలపై పోలీస్ స్టేషన్‌కు ఫోన్‌చేసి చెప్పినా పోలీసులు స్పందించడం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు.



పెండ్యాల సచివాలయంపై కట్టిన టీడీపీ, జనసేన జెండాలు

ఎమ్మెల్యేలను కలిసిన ప్రభుత్వోద్యోగులు

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య)ను పలు గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రభుత్వోద్యోగులు, డ్వాక్రా మహిళలు, అంగన్‌వాడీ కార్యకర్తలు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన నివాసానికి తరలివెళ్లిన పలువురు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేశారు. శాలువాలతో సన్మానించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలను ఉద్దేశించి ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య మాట్లాడుతూ మీకు ఏ సమస్య వచ్చినా తనకు తెలియజేస్తే వెంటనే స్పందిస్తానని తెలిపారు. తాను రాజకీయాలకతీతంగా పనిచేస్తానని వారికి హామీ ఇచ్చారు.

నందిగామలో..

నందిగామ: నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యను శుక్రవారం పలు శాఖల అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేని కలిసి శుభాకాంక్షలు తెలియజేసిన వారిలో మున్సిపల్ కమిషనర్ హేమమాలిని, ఏసీపీ రవికిరణ్, సీఐ హనీష్, నియోజకవర్గ పరిధిలోని ఎస్ఐలతోపాటు ఆయాశాఖలకు చెందిన పలువురు అధికారులు ఉన్నారు. ఎమ్మెల్యే సౌమ్య వారితో కొద్దిసేపు ముచ్చటించారు.



ఎమ్మెల్యే తాతయ్యతో డీఈ శివకోటేశ్వరరావు, ఏఈ హనుమంతరావు, కౌన్సిలర్ రామలక్ష్మి తదితరులు



ఎమ్మెల్యే సౌమ్యతో కమిషనర్ హేమమాలిని, ఏసీపీ రవికిరణ్, సీఐ, ఎస్ఐలు

పెరుగుతున్న స్వీట్‌కార్న్ సాగు

- స్వీట్‌కార్న్‌తో లాభాల పంట
- పెట్టుబడి తక్కువ, ఆదాయం ఎక్కువ
- సాగుకు ఆసక్తిచూపిస్తున్న రైతులు
- పెరుగుతున్న సాగు విస్తీర్ణం



స్వీట్‌కార్న్ పంట(ఫైల్)

వత్సవాయి : పత్తి, మిర్చి వంటి వాణిజ్య పంటలను సాగుచేసిన నష్టాలపాలవుతున్న రైతులు ప్రత్యామ్నాయ పంటలసాగుపై దృష్టిసారిస్తున్నారు. ఇటీవల కాలంలో రైతులు స్వీట్‌కార్న్(మొక్కజొన్న) సాగుపై ఎక్కువగా ఆసక్తిచూపిస్తూ సాగు చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌లో ఎక్కువగా ఈ పంటను సాగుచేస్తున్నారు. స్వీట్‌కార్న్ కంకి ఎండిపోయే దాకా ఉండే అవసరం లేనందున పచ్చికంకి మీద ఉన్నప్పుడే వ్యాపారులు వచ్చి గుత్తగా కొనుగోలు చేసుకుంటుంటారు. దీంతో రైతుకు శ్రమ తగ్గడంతో పాటు ఆదాయం కూడా వస్తుండటంతో ఈసాగు వైపు రైతులు మొగ్గుచూపుతున్నారు.

ఏటా పెరుగుతున్న సాగు విస్తీర్ణం..

మండలంలో గతేడాది స్వీట్‌కార్న్ పంటను సుమారు 150 ఎకరాల్లో సాగుచేయగా ఈఏడాది సాగు విస్తీర్ణం పెరుగనుంది. ఈ ఏడాది 250 ఎకరాల వరకు సాగు ఉండవచ్చని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. ఈ పంటకాలం 75 రోజుల నుంచి 90 రోజులు ఉంటుంది.

సాగు విధానం..

ముందుగా పొలం శుభ్రం చేసుకున్న తరువాత ట్రాక్టర్ లేదా అరకతో కాలువలు తోలుకోవాలి. అనంతరం కాలువలకు నీరు పెట్టి ఎకరానికి నాణ్యమైన 3 నుంచి 4 కేజీల విత్తనాలను నాటుకోవాలి. ఇక అప్పటి నుంచి వర్షం వస్తే సరి, లేకుంటే వారానికి ఒకసారి తప్పకుండా నీటితడిని అందించాలి. ఎకరానికి రెండు డీఏపీ బస్తాలు, పోటాష్ బస్తా, యూరియా రెండు బస్తాలు వేసుకుంటే మంచిది. ముఖ్యంగా పంట కంకిదశలో ఉన్నప్పుడే పురుగు సోకకుండా రెండుసార్లు పైమందులు పిచికారీ చేసుకుంటే కంకులు పురుగుల బారిన పడకుండా ఉంటాయి.

రెండు విడతలుగా సాగు చేపట్టాలి...

సీట్‌కార్న్ పంటను సాగుచేసే రైతులు విస్తీర్ణాన్ని రెండు భాగాలుగా విభజించి సాగు చేపడితే మంచిదని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఉదాహరణకు ఎకరం స్వీట్‌కార్న్ సాగుచేసుకునే రైతులు తొలుత అర ఎకరం నాటిన 20 రోజుల తరువాత, మిగిలిన అర ఎకరంలో విత్తనం నాటుకుంటే పంటకు పంటకు మధ్య నెల రోజుల వ్యవధి ఉంటుంది. దీంతో రెండు విడతలుగా పంట చేతికి వస్తుంది. తద్వారా రైతుకు లాభాలు అధికంగా ఉంటాయి. నీటివసతి ఉన్న రైతులు ఏడాది రెండుసార్లు కూడా ఈపంటను సాగుచేయవచ్చు.

అధిక లాభాలు..



స్వీట్‌కార్న్ పంటకు పెట్టుబడులు తక్కువతో పాటు లాభాలు ఎక్కువగా ఉంటాయి. ఈ పంటకు ముఖ్యంగా కంకిదశలో ఉన్నప్పుడు జాగ్రత్తలు పాటించాలి. కత్తెర పురుగు సోకకుండా రెండుసార్లు మందులను పిచికారీ చేయాలి. మార్కెట్లో స్వీట్‌కార్న్‌కు బాగా గిరాకీ ఉండటంతో వ్యాపారులే స్వయంగా పొలం వద్దకు వచ్చి కంకులను కొనుగోలు చేసి తీసుకువెళ్తారు. రైతులకు పంట రవాణా ఖర్చులు కూడా తగ్గుతాయి.

– వి.రవికుమార్, వత్సవాయి ఏవో

మంచి విత్తనంతోనే అధిక దిగుబడులు

కేవీకే కోఆర్డినేటర్ కృష్ణంరాజు

జగ్గయ్యపేట : నాణ్యమైన విత్తనం ఎంపిక చేసుకోవడం ద్వారానే అధిక దిగుబడులు సాధించవచ్చని గరికపాడు కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) కోఆర్డీనేటర్ ఎం.కృష్ణంరాజు పేర్కొన్నారు. విత్తన ఎంపికలో రైతులు తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పేట నియోజకవర్గ పరిధిలోని పెనుగంచిప్రోలు, వత్సవాయి, జగ్గయ్యపేట పరిధిలో ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో 6వేల ఎకరాలకు పైగా వరిసాగు చేసేందుకు రైతులు సిద్ధమయ్యారు. నూరు శాతం కాలువలు, బోర్లు ద్వారానే అధికంగా సాగవుతోంది. ఖరీఫ్‌లో ముఖ్యంగా బీపీటీ 5204, ఎంటీయూ1061 వంటి రకం సాగులో ఉన్నాయి. ఆయా భూములు, వాతావరణ పరిస్థితులను అనుసరించి రైతులు విత్తనాలను ఎంపిక చేసుకోవాలని కృష్ణంరాజు సూచించారు.

అల్గారిథమ్స్‌పై పట్టు సాధించాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కంప్యూటర్స్ రంగ విద్యార్థులు అల్గారిథమ్స్‌పై పట్టు సాధించినప్పుడు మంచి అవకాశాలను పొందుతారని కృష్ణా విశ్వవిద్యాలయం కంప్యూటర్స్ విభాగ ఆచార్యులు డాక్టర్ ఎం. బాబురెడ్డి అన్నారు. కాకరపర్తి భావనారాయణ కళాశాల కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్ విభాగం ఆధ్వర్యంలో 'డిజైన్ ఆఫ్ ఎఫిషియంట్ అల్గారిథమ్స్' అంశంపై సదస్సును ఆ కళాశాల సెమినార్ హాల్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యవక్తగా హాజరైన డాక్టర్ ఎం. బాబురెడ్డి మాట్లాడుతూ కంప్యూటర్స్ విభాగంలో అల్గారిథమ్స్ చాలా ముఖ్యమైన అంశమన్నారు. కంప్యూటర్స్‌లో పట్టు సాధించాలంటే అల్గారిథమ్స్‌లో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఈ అంశంపై లోతైన విశ్లేషణ చేయగలిగినప్పుడు ఈ రంగంలో మంచి పట్టును సాధించగలరన్నారు. ముఖ్యంగా కంప్యూటర్స్ రంగ విద్యార్థులు తమతమ రంగాల్లో వస్తున్న మార్పులను గమనిస్తూ వాటిపై పట్టు సాధించాలని సూచించారు. ఈ విధమైన సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సదస్సుకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీ నారాయణరావు మాట్లాడుతూ విద్యార్థులకు వారివారి రంగాల్లో వస్తున్న మార్పులను తెలియజేసేందుకు పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వైస్ ప్రిన్సిపాల్స్ పీఎల్ రమేష, ఎం. వెంకటేశ్వరరావు, విభాగాధిపతి పి.రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ బాబురెడ్డి

మూగజీవులపై ప్రేమ, కరుణ చూపాలి

ఆధ్యాత్మికవేత్త వేముల హజరత్తయ్య గుప్తా

భవానీపురం(విజయవాడపశ్చిమ): మానవులతో పాటు మూగజీవాలైన జంతువుల పట్ల కూడా ప్రేమాభిమానాలు, కరుణ చూపాలని ఆధ్యాత్మిక, సామాజికవేత్త, లయన్స్ జిల్లా అంబాసిడర్ వేముల హజరత్తయ్య గుప్తా పేర్కొన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ ఆధ్వర్యంలో హజరత్తయ్య గుప్తా, ఐ. నాగేశ్వరరావు భవానీపురంలోని జీవకారుణ్య సంస్థలోని మూగజీవులకు బియ్యం బస్తాలు, కుక్కలు తినే బిస్కెట్ ప్యాకెట్లు వితరణ చేశారు. ఈ సందర్భంగా గుప్తా మాట్లాడుతూ మూగజీవులపట్ల కరుణతోకూడిన జీవితం గడపటం ద్వారానే భగవంతుని కృపాకటాక్షలను పొందడం సాధ్యమవుతుందన్నారు. క్లబ్ అధ్యక్షుడు కె. రామలింగేశ్వర రావు, కోశాధికారి కె. రామకృష్ణ, కొత్తమాసు రాం కుమార్ పర్యవేక్షణలో జరిగిన డాక్టర్ మురాల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



మూగజీవాల కోసం బియ్యం, బిస్కెట్‌లు అందజేస్తున్న హజరత్తయ్య గుప్తా తదితరులు

మహిళకు వేధింపులు.. వ్యక్తిపై కేసు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మహిళను వేదింపులకు గురి చేస్తున్న వ్యక్తిపై కొత్తపేట పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తపేట బ్రహ్మంగారి మఠం ప్రాంతానికి చెందిన బోయినపల్లి అన్నపూర్ణ, లింగం వెంకటేశ్వరరావు భార్యభర్తలు. అయితే కొంత కాలం కిందట భార్యాభర్తలకు విభేదాల కారణంగా వేరు వేరుగా ఉంటున్నారు. అన్నపూర్ణ రెండేళ్ల కిందట గోపికృష్ణతో సహజీవనం సాగిస్తుండగా, అతనితోనూ విభేదాలు వచ్చాయి. దీంతో గోపికృష్ణకు అన్నపూర్ణ దూరంగా ఉండటంతో వేదింపులకు గురి చేయడంతో పాటు చంపుతానని బెదిరింపులకు పాల్పడసాగాడు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

మలేరియాపై అవగాహన ర్యాలీ

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): మలేరియా వ్యతిరేక మాసోత్సవాలను పురస్కరించుకుని జక్కంపూడి కాలనీలో శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కాలనీలోని అర్బన్ హెల్త్ సెంటర్ నుంచి ర్యాలీ నిర్వహించగా, రాష్ట్ర సీనియర్ ఏంటమాలజిస్ట్ పి.కొండారెడ్డి, ఎన్టీఆర్ జిల్లా డీఎంఓ మోతి బాబు ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీలో మలేరియా వ్యాధి గురించి అవగాహన కల్పిస్తూ సాగింది. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రతీ శుక్రవారం డ్రై డేగా పాటించడంతో పాటు ఇంటి పరిసరాల్లో పనికి రాని సామగ్రిలో వర్షం నీరు నిల్వ ఉంచకుండా చూసుకోవాలని సూచించారు. కాలనీలోని ఖాళీ స్థలాల్లో నిల్వ ఉన్న నీటిలో దోమల లార్వా వృద్ధి చెందకుండా ఆయిల్ బాల్స్ ఏర్పాటు చేయడంతో పాటు కల్వర్టు వద్ద దోమల నివారణకు చర్యలు తీసుకుంటామన్నారు. జ్వరం వచ్చినట్లయితే వెంటనే మలేరియా పరీక్ష చేయించుకోవడంతో పాటు మందులను వాడాలని సూచించారు. ర్యాలీలో మలేరియా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న మలేరియా అధికారులు

ఆర్ఆర్‌పేట ఎల్‌సీ గేట్ తాత్కాలికంగా మూసివేత

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ఎల్‌సీ గేట్ ఓవర్‌హాలింగ్, స్లీపర్‌ల నిర్వహణ పనుల కారణంగా విజయవాడ రైల్వే స్టేషన్ సమీపంలోని రాజరాజేశ్వరిపేట ఎల్‌సీ గేట్‌ను మూడు రోజుల పాటు తాత్కాలికంగా మూసివేయనున్నట్లు విజయవాడ డివిజన్ సీనియర్ సెక్షన్ ఇంజినీర్ శుక్రవారం తెలిపారు. బల్బ్ లైన్‌లోని వీఎస్‌సీ క్యాబిన్–బల్బ్ క్యాబిన్ మధ్యలోని ఈ గేటును ఈ నెల 11న ఉదయం 7 గంటల నుంచి 13వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు తాత్కాలికంగా మూసివేయనున్నారు. ఆ మార్గం నుంచి రాకపోకలు సాగించే వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా రాకపోకలు సాగించాల్సిందిగా ఆయన కోరారు.

14 నుంచి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భీమన వారి పేటలోని శ్రీవిజయదుర్గా రామలింగేశ్వర స్వామివారి దేవస్థాన వార్షిక బ్రహ్మోత్సవాలు 14 నుంచి 16వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు చింతలపాటి సుబ్రహ్మణ్యశాస్త్రి పేర్కొన్నారు. ఉత్సవాల్లో భాగంగా ఆలయ విమాన గోపుర సంప్రోక్షణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించనున్నామని పేర్కొన్నారు. ఉత్సవాలను అవ్వారి ఉమా శంకర దీక్షిత శర్మ పర్యవేక్షణలో వేద పండితులు, అర్చకులు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. 14వ తేదీ ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్యప్రాశన, అఖండ దీపారాధన, ప్రధాన కలశ స్థాపన, ప్రధాన దేవతామూర్తి అనుష్టానం, పారాయణ, హోమాలు నిర్వహిస్తారు. 10 గంటలకు శాంతి కల్యాణోత్సవం, సాయంత్రం శారదా నృత్య పీఠంచే నృత్య ప్రదర్శన జరుగుతుంది. 15వ తేదీ ప్రధాన దేవతామూర్తి అనుష్టానం, పారాయణ, హోమాలు, విమాన గోపురం దేవతా మూర్తుల సంప్రోక్షణ, శాంతి కల్యాణం జరుగుతుంది. 16వ తేదీ ఉదయం శాంతి కల్యాణం, మహా పూర్ణాహుతి, వేద పండితుల ఆశీర్వచనం జరుగుతుంది. సాయంత్రం నగరోత్సవం నిర్వహించనున్నారు.

తాపీతో ఆటోడ్రైవర్‌పై దాడి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఇంటి దగ్గర పిల్లలు క్రికెట్ ఆడుకునే విషయంలో చోటు చేసుకున్న వివాదంలో ఆటోడ్రైవర్‌పై తాపీతో దాడి చేసి గాయపరిచిన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చిట్టినగర్ సాధుజాన్ వీధికి చెందిన తలాడి పైడి ఆటో నడుపుకుని జీవనం సాగిస్తుంటాడు. పైడి ఇంటి సమీపంలోనే అతని తమ్ముడు వరస అయ్యే పైడి చిట్టి కుటుంబం నివాసం ఉంటోంది. కొద్ది రోజుల కిందట చిట్టి పిల్లలు రోడ్డుపై క్రికెట్ ఆడుతుండటంతో వారించాడు. దీంతో చిట్టి భార్యతో పైడికి గొడవ జరిగింది. ఈ నేపథ్యంలో శుక్రవారం సోరంగం రోడ్డు వద్ద ఉన్న పైడికి చిట్టికి గొడవ జరిగింది. గొడవలో చిట్టి తన వద్ద ఉన్న తాపీతో పైడి పొట్టపై గాయం చేశాడు. పొట్టపై తీవ్ర గాయం ఏర్పడటంతో వెంటనే విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొత్తపేట పోలీసులు కేసు నమోదు చేశారు.